# బాధితులకు 'భరోసా' కేంద్రాలు కొండంత అండ

## నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోండి: అడిషనల్ డీజీపీ చారు సిన్హా

## కరీంనగర్ భరోసా కేంద్రం తనిఖీ



కరీంనగర్, ఏప్రిల్ 16: లైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు సురక్షిత వాతావరణంలో చేయూతనందిస్తూ, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించ డంలో 'భరోసా' కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర అడిషనల్ డీజీపీ (సీఐడీ ఃఏసీబీ) చారు సిన్హా పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపల్లిలోని భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఆమె, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలను పరిశీలించారు.

### రికార్డుల పరిశీలన - సిబ్బందికి సూచనలు

కేంద్రంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించిన చారు సిన్హా, సిబ్బందితో మాట్లాడి పనితీరును సమీక్షించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయ సహాయం, కౌన్సిలింగ్ అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

### శిక్షల శాతం పెరగాలి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కా ఆధారాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2024 డిసెంబరులో ప్రారంభమైన ఈ కేంద్రం ద్వారా బాధితులకు పోలీస్ స్టేషన్, ఆసుపత్రి చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా ఒకే చోట అన్ని సేవలు అందించడం అభినందనీయమన్నారు. తనిఖీ అనంతరం భరోసా కేంద్రం ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటస్వామి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై అనూష, భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రాణాలు అమూల్యం.. రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

## 'అరైవ్--అలైవ్' సదస్సులో అడిషనల్ డీజీపీ చారు సిన్హా



కరీంనగర్, ఏప్రిల్ 16: రోడ్డు ప్రమాదాల కారణంగా యువత ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి అత్యంత ఆందోళనకరమని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ఉందని రాష్ట్ర అడిషనల్ డీజీపీ (సీఐడీ ఃఏసీబీ) చారు సిన్హా అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లో నిర్వహించిన 'అరైవ్--అలైవ్' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పర్యవేక్షణలో స్థానిక అస్త్ర కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో 'డిఫెన్సివ్ డ్రైవింగ్' కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన నియమాలను వివరించిన ఆమె, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవడం వంటి చర్యలు ప్రాణాలను కాపాడుతాయని చెప్పారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే సీపీఆర్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు అడిషనల్ డీజీపీ చేతుల మీదుగా హెల్మెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, వేణుగోపాల్, శ్రీనివాస్ జి, వైద్యులు, పోలీసు అధికారులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల చేతిలోనే ప్రమాద రహిత సమాజం



## మానవ, టెక్నికల్ తప్పిదాలతోనే ప్రమాదాలు

## అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ

తిమ్మాపూర్, జనతా న్యూస్ : ప్రమాదాల రహిత సమాజాన్ని నిర్మించాలంటే డ్రైవర్ల చేతిలోనే పూర్తి బాధ్యత ఉంటుందని కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ అన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని తిమ్మాపూర్ మండలంలో వాగేశ్వరీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించి విద్యార్థులకు, పాఠశాల, కళాశాలల వాహన డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె తోపాటు డీటీసీ పురుషోత్తం, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, ఆర్టీసీ ఆర్ఎం రాజు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, వాగేశ్వరీ జనరల్ సెక్రటరీ గంద్ర శ్రీనివాస రెడ్డి, డైరెక్టర్ వినోద్ హాజరై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీసీలో, కళాశాలల్లో ప్రమాదాలు జరుగకుండా డ్రైవింగ్ చేసిన సీనియర్ డ్రైవర్లకు, పలువురు ఆటో డ్రైవర్లకు సన్మానాలు చేసి జ్ఞాపికలను అందించారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంధర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మానవ తప్పిదాలు, టెక్నికల్ సమస్యల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్యం, అజాగ్రత్త, అతివేగం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకే డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడుపాలని సూచించారు. కంటి చూపు పరీక్షలు చేయించుకోవాలని డ్రైవర్లకు తెలిపారు. హెల్మెట్లు, సీట్ బెల్టు ధరించాలని, వాహనాల్లో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. రాబోవు రోజుల్లో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లాల వారిగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు.

### రహవీర పథకం...

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని కాపాడేందుకు కృషి చేసిన వారికి రహవీర పథకాన్ని కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు అందజేస్తున్నాయని ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు ఎవరైతే శ్రమిస్తారో వారిని రహవీర్ పథకం కింద రూ. 25వేల నగదు ప్రోత్సాహకాన్ని, ప్రశంసా పత్రాన్ని ప్రభుత్వాలు అందిస్తాయని తెలిపారు. వ్యక్తి ప్రాణం కాపాడడం ముఖ్యమని, అందుకే ప్రభుత్వాలు అంత ప్రాధాణ్యతనిస్తున్నాయని అన్నారు. ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్ లో చికిత్స అందితే ఎంతో మంది ప్రాణాలను రక్షించవచ్చని, గోల్డెన్ అవర్ లో చికిత్స అందించే ఆ దిశగా ప్రతీ పౌరుడు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రామకృష్ణకాలనీ సర్పంచ్ గుజ్జుల శ్వేత, కళాశాల డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, డీటీవోలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి




తిమ్మాపూర్, జనతా న్యూస్ : ప్రభుత్వం చేపడుతున్న పథకాలను గ్రామీణ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కరీంనగర్ జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండలంలోని కొత్తపల్లి ప్రైవేటు ఫంక్షన్ హాలులో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర అధ్యక్షతన జరిగిన సమావేశానికి జడ్పీ సీఈవో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు శాఖల వారిగా నివేదికలను అందించారు. ప్రభుత్వ పరంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపైన శాఖల వారిగా వివరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహా లక్ష్మీ పథకం, గృహ జ్యోతి, సన్న వడ్ల బోనస్, చేయూత ఫించను, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, మహిళలకు బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, నూతన రేషన్ కార్డులు, ఆరోగ్యం, వైద్య, విద్యపై సంబంధిత శాఖల అధికారులు నివేదికలు సమర్పించి వివరాలను వెల్లడించారు. శాఖల వారిగా గ్రామ, మండల స్థాయిలో లబ్ధిదారుల వివరాలను తెలిపారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తామని, తప్పకుండా పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని అధికారులు చెప్పారు. శాఖల వారిగా నివేదికలు అందించినపుడు సర్పంచులు గ్రామల వారిగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేసిన అభివృద్ధిని, అందించిన సంక్రేమ ఫలాలను వివరిస్తూ, సంక్షేమ పథకాలు అందని వారి నుండి ధరకాస్తులు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని కోరారు. రాబోవు విద్యా సంవత్సరం నుండి పాఠశాల, ఇంటర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం బ్రేక్ ఫాస్టుతోపాటు మద్యాహ్న భోజనమును అందిస్తుందని తెలిపారు. ఆర్థో వికలాంగులకు వాహనాలను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. గ్రామల్లో ఎలాంటి అవసరాలున్నా అధికారుల దృష్టికి సర్పంచులు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, ఎంఈవో శ్రీనివాస్, ఏవో సురేందర్, సర్పంచ్ గోదరి శోభారాణి, ప్రధానోపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# చిగురుమామిడిలో ఘనంగా తెలుగు నాటక రంగ దినోత్సవం



చిగురుమామిడి,జనత న్యూస్: మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.కళాకారుల కమిటీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తొలుత సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయ కొట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన సాంస్కృతిక గీతాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 16ను ప్రభుత్వం నాటక రంగ దినోత్సవంగా ప్రకటించడం శుభపరిణామమన్నారు.మన సంస్కృతి సంప్రదాయాలను, ఇతిహాసాలను తమ నటనతో ప్రజల కళ్లకు కట్టినట్లు చూపే కళాకారులు సమాజ మనుగడ కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అయితే కళాకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించకూడదని, 50 ఏళ్లు దాటిన ప్రతి కళాకారుడికి నెలకు 5 వేల రూపాయల పింఛను అందించాలని డిమాండ్ చేశారు. అలాగే యువ కళాకారులను ప్రోత్సహించేందుకు వారికి నెలకు 15 వేల రూపాయల జీవన భృతి కల్పించాలన్నారు. నాటక ప్రదర్శనలకు అవసరమైన వేషభూషణాలు, మేకప్ సెట్లు, వాయిద్య పరికరాలు మరియు సౌండ్ సిస్టమ్‌ను ప్రభుత్వం ఉచితంగా అందజేయాలని కోరారు.వీటితో పాటు ప్రతి మండల, పట్టణ కేంద్రాల్లో కళాకారుల కోసం ప్రత్యేకంగా కళావేదికలను నిర్మించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ ప్రధాన కార్యదర్శి రాధరపు సంపత్, జిల్లా సహాయ కార్యదర్శి చందబోయిన పరశురాములు, మండల సహాయ కార్యదర్శి కూతడి కొమురయ్య, గౌరవ సలహాదారులు నిలిగొండ కిషన్, మల్లం శ్రీనివాస్, చొప్పదండి సుధాకర్, మొగిలి బొందయ్య, గందె రాములు, విశ్వనాథం సత్తయ్య, పోలోజు కుమారస్వామి, నిలిగొండ సదానందం, అనువోజు బాలకృష్ణమాచారి పాల్గొన్నారు.

# పోలీస్ శాఖకు 'హుస్నాబాద్ మెడికల్ ఫార్మసీ' దాతృత్వం



హుస్నాబాద్,జనత న్యూస్: వ్యాపార ప్రయోజనాలతో పాటు సామాజిక హితాన్ని కాంక్షించినప్పుడే ఆ సంస్థకు గుర్తింపు లభిస్తుందని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పేర్కొన్నారు. పట్టణంలోని హుస్నాబాద్ మెడికల్ ఫార్మసీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆ సంస్థ యాజమాన్యం పోలీస్ శాఖకు 15 చెక్ పోస్ట్ బారికేడ్లను అందజేసింది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ ముఖ్య అతిథిగా పాల్గొని వీటిని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు బారికేడ్లు ఎంతో అవసరమని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వీటిని అందజేసిన ఫార్మసీ నిర్వాహకులను అభినందించారు. ఇతర వ్యాపార సంస్థలు కూడా ఇలాగే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఫార్మసీ యజమానులు ఆంజనేయులు గౌడ్, వేణు, తిరుపతి, మహేంద్ర, నరేష్‌లను ఏసీపీ శాలువాతో ఘనంగా సత్కరించారు.తమ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు ఉపయోగపడేలా ఈ చిన్న సాయం చేయడం సంతోషంగా ఉందని ఫార్మసీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల అమలుకు 1000 కోట్లకు పైగా ఖర్చు

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో సంక్షేమం ప్రజల దరిదాపుల్లోకి: కలెక్టర్ హైమావతి**



సిద్దిపేట, ఏప్రిల్ 16: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రజల అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ఆరు గ్యారంటీల అమలుకు రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిర్వహించిన మండల స్థాయి సమావేశాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొమరవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సభలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామని, ప్రస్తుతం మండల స్థాయి సమావేశాలు కొనసాగుతున్నాయని చెప్పారు. మే నెలలో నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి వారం ఒక శాఖకు సంబంధించిన థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాలు, ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని, వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

జిల్లాలో సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివరాలు తెలియజేస్తూ, కొత్తగా 25 వేల రేషన్ కార్డులు మంజూరు చేసి, పాత కార్డుల్లో 37 వేల మందిని చేర్చామని చెప్పారు. ప్రతి నెల 6580 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కింద 11,241 ఇళ్లను మంజూరు చేసి, 9,954 ఇళ్ల పనులు ప్రారంభించామని, రూ.204 కోట్ల బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. గ్యాస్ సబ్సిడీగా రూ.22.83 కోట్లు, గృహజ్యోతి పథకం ద్వారా రూ.152 కోట్ల విలువైన ఉచిత విద్యుత్, రైతు భరోసా కింద 3.11 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.392 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.330 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు, మర్కుక్‌లో తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కొండపాకలో రూ.200 కోట్లతో పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కూడా వేగంగా జరుగుతోందన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకాన్ని జూన్ 2న ప్రారంభించనున్నట్లు, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందిస్తామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇంటర్మీడియట్ వరకు ఉచిత మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం పథకాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రహదారి భద్రత, పౌష్టికాహారం అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, మహిళలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై అసత్య ప్రచారాలు తగవు

**ఎవరెన్ని కుట్రలు చేసినా గ్రామ అభివృద్ధిని అడ్డుకోలేరు**

**గ్రామ సర్పంచ్ అలువాల శంకర్**



చిగురుమామిడి,జనత న్యూస్:మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో జరుగుతున్న సి.సి. రోడ్ల నిర్మాణ పనులపై కొందరు ఉద్దేశపూర్వకంగా, అభివృద్ధిని అడ్డుకోవాలని... కనీస అవగాహన లేకుండా ఆధారరహిత ఆరోపణలు చేయడం సరికాదని గ్రామ సర్పంచి అలువాల శంకర్, 8వ వార్డ్ సభ్యురాలు కోల రజిత  చంద్రమోహన్ హితవు పలికారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన గ్రామ అభివృద్ధిని అడ్డుకోలేరని మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని అన్నారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 4వ వార్డ్ సభ్యులు సయ్యద్ షరీఫ్ చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు.గ్రామంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పని ప్రభుత్వ నిబంధనలు మరియు ఇంజినీరింగ్ ప్రమాణాలకు లోబడే జరుగుతోందని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని స్పష్టం చేశారు.పనుల్లో నాలుగు రకాల సిమెంట్ వాడుతున్నారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, అధికారుల ఆమోదం పొందిన ఒకే గ్రేడ్ సిమెంట్‌ను మాత్రమే వినియోగిస్తున్నామని వివరించారు. పనులు జరుగుతున్న సమయంలో పర్యవేక్షించకుండా, నిర్మాణం పూర్తయిన 11 రోజుల తర్వాత వచ్చి రాజకీయ ప్రయోజనాల కోసం రాద్ధాంతం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పనుల్లో అత్యంత కీలకమైన క్యూరింగ్ ప్రక్రియను కూడా ప్రతిరోజూ పద్ధతి ప్రకారం నిర్వహిస్తున్నామని, దీనిపై అసత్య ప్రచారాలు చేయడం గ్రామ అభివృద్ధిని అడ్డుకోవడమేనని విమర్శించారు.పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌లో మాట్లాడేటప్పుడు బాధ్యతగా ఉండాలని, ఆధారాలు లేకుండా మాట్లాడటం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్ప, అనవసర ఆటంకాలు సృష్టించవద్దని కోరారు. పారదర్శకతతో సమాధానాలు ఇవ్వడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని, గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, వార్డు సభ్యులు కొత్త మధు, సుధగోని రమాదేవి, కోల ప్రభాకార్, గ్రామస్తులు కొండ పురుషోత్తం, జనవేణి వెంకటేష్, అలువాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తాం

## రాంనగర్ పాఠశాల తనిఖీ చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, ఏప్రిల్ 17: ప్రభుత్వాలు విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నాయని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 49వ డివిజన్ విద్యానగర్ ప్రాంతంలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించి, పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీప్రకాష్, ఉపాధ్యాయులు, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పాఠశాలలోని మరుగుదొడ్లు, తరగతి గదులు, ఇతర వసతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్య, బోధన విధానం, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన మేయర్, వాటిని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గతంలో నిర్మించిన మరుగుదొడ్లు ప్రస్తుతం మరమ్మతుల దశలో ఉన్నాయని, వాటిని త్వరలోనే ఆధునీకరించి వినియోగానికి తీసుకువస్తామని తెలిపారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లీచింగ్, క్రిమినాశక మందులతో శుభ్రపరిచి దుర్వాసన రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక విద్యార్థుల కోసం అదనపు మరుగుదొడ్లు నిర్మించే చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులకు సురక్షిత త్రాగునీరు అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో దీనికి నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన మేయర్, ప్రతి పాఠశాలలో కనీస వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునే వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కర్రె పద్మ అనిల్, గాజ రమ శివరాం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు అవసరం

**అక్రమ రవాణాపై చెక్‌పోస్టులతో నిఘా పెంపు**




కరీంనగర్, ఏప్రిల్ 17: వన్యప్రాణుల సంరక్షణకు మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నిర్వహించిన వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశంలో ఆమె కీలక సూచనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ పోలీసు ప్రతినిధులు హాజరై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అక్రమ వన్యప్రాణి రవాణా నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం--1972ను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు. అడవి జంతువులు, పక్షుల అక్రమ తరలింపును అరికట్టేందుకు సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాలు, కీలక రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అనుమానాస్పద వాహనాలపై కఠిన తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. సంయుక్త చర్యల ద్వారా వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్, అటవీ శాఖ అధికారులు మరియు ఇతర సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కిసాన్ నగర్ హిందూ సమ్మేళనం

**ఐక్యతతోనే ధర్మం, దేశం బలపడతాయి: ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు**






కరీంనగర్, ఏప్రిల్ 17: కరీంనగర్ నగరంలోని కిసాన్ నగర్ బస్తీలో చత్రపతి శివాజీ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని గోపూజతో ప్రారంభించి, అనంతరం సమ్మేళన సభను నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ విభాగ ప్రచార ప్రముఖ్ తడిగొప్పుల శంకరయ్య మాట్లాడుతూ, సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజన హిందూ సమాజానికి ప్రమాదకరమని అన్నారు. హిందువులు ఐక్యంగా ఉన్నప్పుడే దేశం, ధర్మం సుస్థిరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు ఐకమత్యం లేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని, అదే పరిస్థితి రాకుండా హిందూ సమాజం సంఘటిత శక్తిగా మారాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, దేశభక్తి, జాతీయ భావం పెంపొందించుకోవాలని సూచించారు.

హిందూ ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'పంచ పరివర్తన్' కార్యక్రమాల ద్వారా సమాజంలో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. సంఘం దేశహితం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సేవికా సమితి ప్రాంత శారీరక ప్రముఖ్ లెక్కల రమ మాట్లాడుతూ, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందని, దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష వంటిదని పేర్కొన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ కూడా ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో సమ్మేళన కార్యనిర్వహణ సమితి అధ్యక్షుడు పసుల మహిపాల్, ప్రధాన కార్యదర్శి గాజుల కృష్ణ, జనజాగరణ సమితి అధ్యక్షుడు ఎన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మేంగని రాజయ్య, ఉపాధ్యక్షులు, ఉప కార్యదర్శులు, బస్తీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com